

2న ఘంటసాల పాటల పోటీలు

ప్రజాశక్తి -తిరుపతి సిటి ఫిబ్రవరి 2వ తేదీన ఘంటసాల పాటల పోటీలను తిరుపతిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రహమతుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. 'ఘంటసాల ది గ్రేట్' అనే సినిమా ఫిబ్రవరి 14న విడుదలవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆవరణలో ఘంటసాల పాటలపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పదహారేళ్ళు పైబడిన స్త్రీ పురుషులు సీనియర్స్ గాను, (స్త్రీ పురుషులకు వేర్వేరు బహుమతులు ఇవ్వబడతాయి), పదహారేళ్ళ లోపు వారు జూనియర్స్ గాను పరిగణింపబడతారు. పురుషులు ఘంటసాల సోలో పాటలు మాత్రమే పాడాలి. మహిళలు ఘంటసాల యుగళగీతాలు గాని, ఘంటసాల సంగీత దర్శకత్వంలో గాయనీమణులు పాడిన పాటలు గాని పాడవలసి ఉంటుంది. ఈ పోటీ ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమై సాయంత్రం ఆరు గంటలకు ముగుస్తుంది. వివరములకు 8341532799, 7207532799 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

'బాలాజీ' డివిజన్ ప్రకటించేనా..!

గత ఐదేళ్లలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైల్వే బడ్జెట్లో నిరాశే మిగిలింది. కొత్త ప్రాజెక్టులు లేవు.. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేవు. ఈసారైనా బాలాజీ డివిజన్ ఏర్పాటుపై రైల్వే బడ్జెట్లో హామీ ఇస్తారన్న ఆశతో ఎంపిలు ఉన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ కేంద్ర బడ్జెట్‌తో పాటే రైల్వే బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. తిరుపతి జిల్లా కొత్తగా ఏర్పడి రెండేళ్లయినా రైల్వే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు అంతంతమాత్రమే. దీంతో పెండింగ్ ప్రాజెక్టులు నత్తనడకనే సాగుతున్నాయి. బాలాజీ డివిజన్ ప్రకటిస్తే బడ్జెట్లో ప్రత్యేక నిధులను విడుదల చేయడమే గాకుండా, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయి. గుంతకల్ రైల్వే డివిజన్ రైల్వేపరంగా ఎంతో ఆదాయం ఇస్తున్నప్పటికీ బడ్జెట్‌లో మాత్రం నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత లేదన్నది వాస్తవం. సిఆర్ఎస్‌ను రైల్వేవ్యాగన్ ఫ్యాక్టరీగా మార్పు చేసి కొత్త ఉద్యోగాలు ఇవ్వాలన్నది ఈ ప్రాంతపు నిరుద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్రంలోనే ఉమ్మడి చిత్తూరు జిల్లా రైల్వేపరంగా చాలా వెనుకబడి ఉంది. ఈ ప్రాంతంలో నిరుద్యోగ యువత ఉపాధి లేక పక్క రాష్ట్రాలకు వలస వెళుతుంటారు. పండించే కూరగాయలను, పండ్లను అమ్ముకోవాలంటే సరైన రవాణా వసతి లేదు. తిరుపతి జిల్లాలో తిరుపతి, రేణిగుంట రైల్వేస్టేషన్ మినహా మిగిలిన స్టేషన్లలో ఆదాయం అంతంతమాత్రమే. తిరుపతి రైల్వేస్టేషన్‌కు రిజర్వేషన్ ద్వారా ఏడాదికి రూ.175 కోట్లు ఆదాయం వస్తుంది. రేణిగుంటకు ఏడాదికి 80 కోట్లు వస్తుంది. రేణిగుంట జంక్షన్‌గా సరుకు రవాణా ఇటు తమిళనాడు, అటు కర్నాటక రాష్ట్రాలకు వెళుతుంది. రేణిగుంట రైల్వేస్టేషన్ తూర్పు వైపు అభివృద్ధికి రూ.250 కోట్లు అవసరం. తిరుపతి రైల్వేస్టేషన్ పడమర వైపు రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకూ 70శాతం పనులు పూర్తయ్యాయి. తిరుచానూరు రైల్వేస్టేషన్ ప్రారంభించినప్పటికీ కేవలం తిరుపతికి వచ్చే రైళ్ల హాల్ట్‌గానే వినియోగించుకుంటున్నారు. చంద్రగిరి రైల్వేస్టేషన్లో కొన్ని రైళ్లు ఆగుతున్నాయి తప్ప సూపర్‌ఫాస్ట్ ఆగడం లేదు. తిరుపతి - పాకాల జంక్షన్ మధ్య డబుల్‌లైన్ వేయాలని ప్రతిపాదన ఉన్నా బడ్జెట్‌లో నిధులు మంజూరు కాలేదు. శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌లో విజయవాడ, హైదరాబాద్ వెళ్లే రైళ్లు మాత్రమే కొన్ని ఆగుతున్నాయి. గూడూరు రైల్వేస్టేషన్‌లో ఇటు తమిళనాడు, అటు విజయవాడ, విశాఖ, ఒరిస్సా రైళ్లు ఆగుతాయి. ఇక్కడా కొన్ని ప్లాట్‌ఫారాలను విస్తరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. తిరుపతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్‌ట్రైన్ నడపాలని ప్రతిపాదన ఉంది. చెన్నయ్ - బెంగుళూరు మధ్య బుల్లెట్ ట్రైన్ సర్వే పనులు పూర్తయ్యాయి. ఈ బుల్లెట్ ట్రైన్‌కుచిత్తూరు, గుడిపల్లి వద్ద స్టాపింగ్‌లు ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న కడప- మదనపల్లి - బెంగుళూరు రైల్వే పనులు ఈ బడ్జెట్‌లో అయినా పూర్తి చేయాలని రెండు రాష్ట్రాల ప్రయాణికులు కోరుతున్నారు.

బాలాజీ రైల్వేడివిజన్ ఏర్పాటుకు వినతి : మద్దిల గురుమూర్తి, ఎంపి, తిరుపతి

తిరుపతి - కాట్పాడి, తిరుపతి - గూడూరు, తిరుపతి- ధర్మవరం, తిరుపతి - యర్రగుంట్ల, తిరుపతి- శ్రీకాళహస్తి నడికుడి మార్గాలను పరిధిగా చేసుకుని తిరుపతి కేంద్రంగా కొత్తగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి. తిరుపతి ఆధ్యాత్మిక నగరమే కాకుండా విద్యాకేంద్రంగా విరాజిల్లుతోంది. పలు పారిశ్రామికవాడలకు కేంద్రంగా ఉంది. బాలాజీ డివిజన్ ఏర్పడితే సరుకు, ప్రయాణికుల రవాణాతో పాటు, వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి తోడ్పడుతుంది. తిరుపతి ఆధ్యాత్మిక నగరం కావడంతో వారంలో రెండు మూడు రోజులు మాత్రమే నడిపే రైళ్లను ప్రతిరోజూ నడపాలన్నారు.

రైళ్లను ఆపాలని అభ్యర్థన

వెండోడు రైల్వేస్టేషన్‌లో కృష్ణా, తిరుపతి - పూరి, తిరుమల ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలి. దక్షిణ రైల్వే జోన్ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట స్టేషన్లలో చెన్నై ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం. 12604), నవజీవన్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్లు 12655/56), కాకినాడ పోర్ట్-చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 17644) నిలుపుదల కోసం అభ్యర్థించడం జరిగింది. చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు నడుస్తున్న మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించవలసినదిగా కోరారు. రేణిగుంట స్టేషన్‌ను తిరుపతి ఈస్ట్, తిరుచానూరు స్టేషన్‌ను తిరుపతి సెంట్రల్‌గా పేర్లను పరిశీలించాలి.

మతోన్మాదాన్ని ఎదిరించడమే..
'జాతిపిత'కు అసలైన నివాళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

జాతిపిత మహాత్మాగాంధీ వర్థంతి పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా నివాళి అర్పించారు. మతోన్మాదాన్ని ఎదిరించి, మతసామరస్యాన్ని కాపాడుకోవడమే జాతిపిత గాంధీజికి మనమిచ్చే అసలైన నివాళి అని వక్తలు ఉద్ఘాటించారు. అఖిలభారత రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర.లక్ష్మయ్య మాట్లాడుతూ కులమత బేధాలను విడనాడి భారతీయులంతా ఐక్యంగా ఉండాలని నినదించిన గాంధీజీ పేరు ఉచ్ఛరించే అర్హత బిజెపి పాలకులకు లేదన్నారు. మతోన్మాదశక్తులు దేశాన్ని ఏలుతూ ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ వాది గాడ్సే జాతిపిత గాంధీని హత్య చేశాడని, అందుకే అప్పుడు ఆర్ఎస్ఎస్ ను నిషేధించారని గుర్తు చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టీ.సుబ్రహ్మణ్యం, నాయకులు వేణుగోపాల్, ఆర్ లక్ష్మి, , బుజ్జమ్మ, కే ఆర్ ఎస్ మన్యం, మునిరామయ్య, బాలు పాల్గొన్నారు.

- వేమన విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు టెంకాయల దామోదరం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ మతసామరస్యానికి పరితపించిన మహాత్మాగాంధీని మతోన్మాదులు తుపాకీ తూటాలకు బలిచేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నడ్డినారాయణ, మునిలక్ష్మి, గురునాథం, రఫీ, బాలాజీ చౌదరి, పంచముఖేశ్వర రావు, కెఆర్ ఎస్ మణ్యం, మునిరామయ్య, ప్రసూన, మనోహర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.
- మహాత్మాగాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ వై.లక్ష్మీ నరసయ్య అన్నారు. తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. దేశ స్వాతంత్ర్యానికి మహాత్మాగాంధీ అహింసా మార్గంలోనే అనేక ఉద్యమాలను చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, డి.ఎస్. వరకుమార్ పాల్గొన్నారు.
- కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. ఛైర్మన్ పిసిరాయల్, డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.
- ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో బాపూజీ మార్గం అందరికీ ఆదర్శనీయం అంటూ నివాళి అర్పించారు. వైద్య విద్యార్థులు బాపూజీ గురించి చిన్న నాటికను ప్రదర్శించారు. ఎస్ వి వైద్య కళాశాల అనాటమీ విభాగాధిపతి డాక్టర్ తెరిసా రాణి, డాక్టర్ మెహెర్, డాక్టర్ జగదీష్, డాక్టర్ మణికంఠ పాల్గొన్నారు.
- మహిళా వర్సిటీలో వీసీ ఆచార్య ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.
- గూడూరు పెద్దబజారువీధిలోని మహాత్మాగాంధీ విగ్రహానికి సిపిఎం నాయకులు నివాళి అర్పించారు. జోగి శివకుమార్, పామంజి మణి, బివి రమణయ్య,అ దపాల ప్రసాద్, బి.చంద్రయ్య, మదన్ పాల్గొన్నారు.

ఇళ్లవద్దనే సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ : కలెక్టర్

తిరుపతి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఫిబ్రవరి 1న ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం డిఆర్‌డిఏ పీడీ, లీడ్‌బ్యాంకు మేనేజర్, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, డిపిఒలతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి 2,63,191 మంది పింఛన్‌దారులకు దాదాపు 112.19 కోట్ల రూపాయలు పంపిణీ చేయనున్నామని తెలిపారు.గత నెలలో ఏదేని కారణంతో పింఛన్ తీసుకోకుంటే ఈ నెల పింఛన్ మొత్తంతో కలిపి పంపిణీ చేయాలన్నారు.

వీధిదీపాలు వెలిగేలా చూడండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులను కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధి 50 వ వార్డులోని భూపాల్ హౌసింగ్ కాలని, తిమ్మినాయుడు పాలెం, అరుంధతివాడ, గరుడాద్రి నగర్, శ్రీనివాస నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం పరిశీలించారు. రోడ్లలో ఉన్న గుంతలను పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. వెంకట ప్రసాద్, ఎలక్ట్రికల్ డి.ఈ. శిల్ప, శానిటరీ సూపర్ వైజర్ సుమతి ఉన్నారు.అనంతరం నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థుల హాజరు నమోదును కమిషనర్ పరిశీలించారు. పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టేలా గురువారం మధ్యాహ్నం ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖ అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను గడువు లోపు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకష్ణ నాయక్ స్పష్టం చేశారు. గురువారం మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, కార్యక్రమాల వివరాలను నిశితంగా పరిశీలించి పురోగతి లేని కార్యక్రమాలను పూర్తి చేయడానికి తగిన సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ఎన్సీడీ స్క్రీనింగ్, ఆర్ బిఎస్ కే స్కూల్ హెల్త్ స్క్రీనింగ్, ఆర్ సి హెచ్ లక్ష్యాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ బిఎస్ కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, మంగళం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయంతి పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలల నివేదికలు సిద్ధం చేయండి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - రామచంద్రాపురం

రాష్ట్రంలో విద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు నూతన మోడల్ స్కూల్ ఏర్పాటుకు నివేదికలను సిద్ధం చేయాలని చంద్రగిరి నియోజకవర్గ విద్యాశాఖ ప్రత్యేక అధికారి, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ అన్నారు. గురువారం మండల రెవెన్యూ తాహసిల్దార్ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారులు, క్లస్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలను ఏకం చేసి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలలో డూప్లికేట్ ఎన్రోల్మెంట్ ఉంటే వెంటనే తొలగించాలని కోరారు. దూర ప్రాంతాల నుండి మోడల్ స్కూల్లో చదువుకునే విద్యార్థులకు రవాణా ఖర్చులను ప్రభుత్వం తల్లిదండ్రుల ఖాతాలకు జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కే వెంకటరమణ, ఎం ఈ ఓ లు మార్కండేయనాయుడు, జయ వేలు, క్లస్టర్ పాఠశాల ఉపాధ్యాయులు తులసి కుమారి, సృజన కుమారి, భాస్కర్ పాల్గొన్నారు.

కాలువ పక్క.. కట్టడం పక్కా..!
మురుగుకాల్వ ఆక్రమణ ఎంచక్కా..!
పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మురుగు కాల్వపై పక్కా నిర్మాణం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణంలో ఎక్కడైనా ఏదైనా నిర్మాణం జరుగుతుంటే గద్దలా వాలిపోయి... పనులు ఆపివేసి... హడావుడి చేసి... సక్రమంగా ఉన్నా ఏదో ఒక వంక చెప్పి "ధర" కుదుర్చుకుని వెళ్లే మున్సిపల్ అధికారులు, పట్టపగలు ప్రధాన రహదారి పక్కనే నిర్మాణం జరుగుతున్నా కన్నెత్తి చూడడం లేదు. మురుగు కాలువపై అక్రమంగా నిర్మాణం చేస్తున్నారని స్థానికులు మున్సిపల్ ఉన్నతాధికారికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదు చేసి వారం రోజులైనా ఎటువంటి స్పందన కనిపించలేదు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అత్యంత సమీపంలో సన్నిధి వీధిలో ఈ దారుణం జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు 40 అడుగుల రోడ్డు నిర్మాణం చేసి మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేయడానికి దేవస్థానం అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఒకవైపు ఉన్న ఆక్రమణ కూడా తొలగించారు. రెండో వైపు ఆక్రమణలు జరగకుండా ఇనుప స్తంభాలను నాటారు. అయితే ఇనుప స్థంబాలను నాటడంతో అన్నీ సక్రమమని దేవస్థానం అధికారులు భావించినట్లున్నారు. దేవస్థానంకు సంబంధించిన మురుగునీరు గొడ్డేరులో కలవడానికి పైపులను కూడా ఏర్పాటు చేశారు. అటువంటి కాలువను ఆక్రమించి పక్కా నిర్మాణం జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అంతేగాకుండా గొడ్డేరు నుంచి రోడ్డుపైకి రావడానికి పురాతన మెట్లు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే మున్సిపల్ అధికారులకు అన్నీ సమర్పించుకున్నానని భవనం యజమాని చెబుతున్నట్లు సమాచారం. ఎవరెవరికి ఎంతెంత సమర్పించారో తెలియదు గానీ నిర్మాణ పనులు చక చకా జరుగుతున్నాయి. మురుగుకాలువను ఆక్రమించి సైతం నిర్మాణం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులే కాకుండా దేవస్థానం అధికారులు కూడా స్పందించాలి. లేకుంటే మురుగునీరు వెళ్లడానికి కూడా అవకాశం ఉండదు.

ప్రసాదం 'పక్క'దారి
మంత్రి లోకేష్ కు ఫిర్యాదు చేసిన భక్తుడు
సెక్యూరిటీ గార్డును తొలగించిన ఈవో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో ఎక్కడ ఎటువంటి సమస్యలు ఉన్నా అధికారులు పట్టించుకోరు. ఫిర్యాదు చేసినా స్పందించరు. భక్తుల బాధలు కనిపించవు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా తామింతేనన్న ధోరణిలోనే వ్యవహరిస్తుంటారు. ఈవో స్థాయి అధికారి నుంచి మొదలు అటెండర్ వరకు దాటవేత విధానాన్ని అవలంబిస్తున్నారు. ఏం జరిగినా తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. సాక్షాత్తు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చిన్న విషయంలో జోక్యం చేసుకుంటే అప్పుడు మాత్రమే ఈవో స్పందించారు. ఆలయం లోని 16 కాళ్ల మండపంలో భక్తులకు ఉచిత ప్రసాదం అందిస్తారు. అయితే భక్తులకు పంచాల్సిన ఉచిత ప్రసాదాన్ని దేవస్థానం సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు, హోంగార్డులు, ఎస్పీఎఫ్ సిబ్బంది తమకు కావలసినంత కవర్లలో తీసుకెళు తున్నారనే ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఈనెల 28వ తేదీన ఒక భక్తుడు ఉచిత ప్రసాదం తీసుకోవడానికి రాగా ప్రసాదం ఉన్నా కూడా లేదని అర్చకుడు సమాధానం చెప్పడంతో ఆ భక్తుడు వాదనకు దిగాడు. అదే సమయంలో ఒక మహిళా సెక్యూరిటీ గార్డు కవర్లో ప్రసాదం తీసుకెళ్తుండగా భక్తుడు ప్రశ్నించాడు. ప్రశించిన భక్తుడుపై మహిళా గార్డు దురుసుగా ప్రవర్తించారు. దీనిపై ఆ భక్తుడు ఎంతో ఆవేదనతో మంత్రి లోకేష్ కు ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేశాడు. దీనిపై మంత్రి లోకేష్ వెంటనే స్పందించి దేవస్థానం అధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఈవో బాపిరెడ్డి స్పందించి సీసీటీవీ పుటేజీ పరిశీలించి మహిళా సెక్యూరిటీ గార్డును విధుల నుంచి తొలగించారు. ప్రసాదం పంపిణీ చేసే మండపం సమీపంలో దేవస్థానం శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్టు సిబ్బంది, అవుట్సోర్సింగ్ సిబ్బంది, ఎస్పీఎఫ్ సిబ్బంది, హోంగార్డులు అందరూ ఉంటారు. భక్తుడు ప్రశ్నించిన సమయంలో వీరిలో ఎవరో ఒకరు స్పందించి ఉంటే సమస్య అక్కడికక్కడే పరిష్కారం అయ్యేది. మంత్రి లోకేష్ వరకు ఫిర్యాదు వెళ్లి ఉండేది కాదని భక్తులు అంటున్నారు.

16న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగుల సదస్సు

తిరుపతి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నంబర్ 2ను సవరించి, అందరికీ ఎంటిఎస్ అమలు చేయాలని కోరుతూ, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 16న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగుల సదస్సు జరుగుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, జెఏసి ఛైర్మన్ గండికోట నాగ వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు వేమన విజ్ఞాన కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా శాసనమండలి సభ్యులు ఐ.వెంకటేశ్వరరావు, జెఏసి రాష్ట్ర ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు జి.చిన్నబాబు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలో మూడు లక్షల మందికి నష్టదాయకంగా జీవో నంబర్2ను సవరించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎస్.మొహిద్దీన్, జి.నారాయణమ్మ, రాజేంద్ర, ఇఎస్ కుమార్, రఘు పాల్గొన్నారు.

సదస్సు జయప్రదం చేయాలంటూ కరపత్రాల ఆవిష్కరణ

గూడలి ఇసుక రీచన్ పరిశీలన

ప్రజాశక్తి -కోట మండలంలోని గూడలిలో ఇసుక రీచ్‌ను గురువారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గూడలి స్వర్ణముఖి నదిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించకూడదని తెలిపారు. ఇసుక రీచ్ అనుమతులు వచ్చేదాకా ఎవరైనా టిప్పర్లతో ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా గూడలి పంచాయతీలోని పలువురు గ్రామస్తులు ఇసుకను తరలిస్తున్నారని సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ దష్టికి తీసుకొచ్చారు. దీనితో స్వర్ణముఖి వద్ద రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట తాహసిల్దార్ కే.జయ జయ రావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, గూడూరు జేఈ ఫరూక్ ఉన్నారు.

అతి వేగం ప్రాణాలకు ముప్పు : ఆర్టీవో

గూడూరు టౌన్ : అతివేగం ప్రాణాలకు ముప్పు అని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని గూడూరు రవాణా శాఖ అధికారి కిషోర్ కోరారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థినులతో హెల్మెట్లు ధరించి రవాణా శాఖ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్టీవో కిషోర్, డీఎస్పీ గీత జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు జాకీర్, సునీల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

'ఇస్రో'కు అభినందనలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో ఇస్రోకు అభినందనలు తెలిపారు. జిఎస్ఎల్‌వి ఎఫ్ 15 రాకెట్ విజయవంతంగా ప్రయోగించి అంతర్జాతీయ స్థాయిలో భారత దేశం ఖ్యాతిని , వంద ప్రయోగాలు పూర్తి చేసి 548 ఉపగ్రహాలను నింగిలోకి విజయవంతంగా పంపినందుకు ఇస్రో శాస్త్రవేత్తలకు విద్యార్థులు వంద, రాకెట్ ఆకారంలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అకడమిక్ డీన్ శ్రీహరి, సాఫ్ట్‌స్కిల్ ట్రైనర్ సోనియా, ఉపాధ్యాయులు రఫీ, రాఘవయ్య, సుప్రజ, మస్తాన్ బీ పాల్గొన్నారు.

శ్రీ ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి -తిరుమల తిరుపతికి చెందిన బ్లిస్ హోటల్స్ గ్రూప్ ఛైర్మన్ ఎం. సూర్యనారాయణ రెడ్డి దంపతులు టిటిడి ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్ట్ కు రూ.10,00,116 విరాళాన్ని గురువారం అందించారు. ఈ మేరకు చెక్కును టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి తిరుమలలోని అడిషనల్ ఈవో క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌సిసి విద్యార్థులకు అభినందన

పుత్తూరు టౌన్ : క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వం లక్షణాలు ఎన్‌సిసి వల్ల అలవాడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. ఇటీవల విజయవాడలోని ఇందిరాగాంధీ మైదానంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన రిపబ్లిక్ దినోత్సవ వేడుకల కవాతులో విద్యార్థులు జె.శేషాద్రి, ఎం.సముగ, పూజారి లావణ్య పాల్గొన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ జి.కోటేశ్వరయ్య, వి.వీరయ్య, ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

1-9 తేదీల్లో తిరుపతిలో 'పుస్తక పండుగ'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) పుస్తక పఠనంతో జీవిత లక్ష్యాలకు పునాదులు వేసుకునే అవకాశం ఉందని, దేశ విదేశాల్లో ఉపాధి అవకాశాలు సాధించుకునేలా స్వీయ నైపుణ్యతను భారతీయ విద్యా భవన్ నిర్వహించే పుస్తక ప్రదర్శన కలుగజేస్తోందని భారతీయ విద్యా భవన్ డైరెక్టర్, ట్రెజరర్ సత్యనారాయణ రాజు అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఫిబ్రవరి 1 తేదీ నుండి 9వ తేదీ వరకు భారతీయ విద్యాభవన్ టీటీడీ సౌజన్యంతో 17వ పుస్తక ప్రదర్శనకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. యుగంధర్ రాజు, దక్షిణామూర్తి, రవిశేఖర్ పాల్గొన్నారు.

దూరవిద్య కేంద్రం పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోని 48 దూరవిద్య కేంద్రాలలో ఫిబ్రవరి 3వ తేదీ నిర్వహించాల్సిన పరీక్షలను అనివార్య కారణాల వల్ల వాయిదా వీసీ ఆదేశాల మేరకు వేస్తున్నట్లు కేంద్రం డైరెక్టర్ ఆచార్య తవమణి వెల్లడించారు. త్వరలోనే తిరిగి పరీక్షా తేదీని వెల్లడిస్తామని పేర్కొన్నారు.

డాక్టర్ ఎస్వీ మోహన్‌కు ఎబిఆర్ఎస్ఎం సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ హైదరాబాదులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో చీఫ్ సైంటిస్ట్ గా పని చేస్తున్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ పూర్వ విద్యార్థి డాక్టర్ ఎస్వి మోహన్ నాగపూర్ లోని ప్రతిష్టాత్మకమైన సీఎస్ఐఆర్- నీరి (నేషనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్) డైరెక్టర్ గా నియామకమైన సందర్భముగా ఐఐసీటీలో డాక్టర్ ఎస్వి మోహన్ ను ఏబిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డాక్టర్ ఎస్ వి మోహన్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి గతంలో ఉపకులపతిగా పనిచేసిన ఆచార్య ఎస్.జయరామ రెడ్డి కుమారుడు కావటం ఎస్వియూకు ఎంతైనా గర్వకారణం అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య వైవి రామిరెడ్డి పేర్కొన్నారు.

మండల సమావేశంలో పంచాయతీ ఆదాయం పెంచుకునేలా కసరత్తు

పంచాయతీల ఆదాయం పెంచుకోవాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పంచాయతీల ఆదాయం పెంచుకుని గ్రామ సమస్యలను పరిష్కరించుకోవాలని ఎంపిడిఒ రమేష్‌బాబు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి మునివేలమ్మ అధ్యక్షతన జరిగింది. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే నిధులపై ఆధారపడకుండా పంచాయతీలోనే వచ్చే ఆదాయాన్ని సమకూర్చుని పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ ఛార్జీలు వంటి మౌళిక వసతులు కల్పించుకోవాలన్నారు. ఎంపిపి మునివేలమ్మ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు సంబంధించి వైద్యసిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. డిప్యూటీ తహశీల్దార్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములు పేదలకు ఇచ్చే స్థలాలను క్రమబద్ధీకరించుకుని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. విద్యుత్ శాఖ ఎఇ సాయికుమార్ మాట్లాడుతూ పిఎం సౌర విద్యుత్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఈ పరికరాలను ఉచితంగా అందిస్తామన్నారు. విఎస్ఎస్ పురానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచితెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి మునిస్వామిరెడ్డి, విమలమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ పులివర్తి నాని

ఎన్టీఆర్‌నగర్‌లో నూతన సబ్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

చంద్రగిరి నియోజకవర్గంలో ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తామని, అందులో భాగంగా ఎన్టీఆర్ నగర్‌లో నూతన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించినట్లు ఎంఎల్‌ఎ పులివర్తి నాని తెలిపారు. గురువారం చంద్రగిరి మండలంలోని తొండవాడ సమీపంలో నూతన ఎన్టీఆర్ కాలనీలో 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించి ప్రారంభించారు. పాకాల, రామచంద్రాపురం, యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు, తిరుపతిరూరల్ మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ సురేంద్రనాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వాసుదేవరెడ్డి, బాలాజీ, ఏడీలు భాస్కర్‌నాయుడు, శేషాద్రిరెడ్డి పాల్గొన్నారు.

జపాన్ రాయబారితో శ్రీసిటీ ఎండీ సమావేశం

ప్రజాశక్తి -వరదయ్యపాలెం

జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకాహషి ఆహ్వానం మేరకు, భారత్ లోని జపాన్ రాయబారి ఒనో కెయిచి గౌరవార్థం చెన్నైలో నిర్వహించిన స్వాగత కార్యక్రమానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హాజరయ్యారు. గత నవంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా చెన్నై పర్యటనకు విచ్చేశారు. అనేక జపనీస్ కంపెనీలకు నిలయంగా మారుతున్న శ్రీసిటీలోని సుస్థిర పర్యావరణ వ్యవస్థను ప్రధానంగా ఆయన దష్టికి తెచ్చారు. శ్రీసిటీ అభివద్ధి, వ్యాపార అవకాశాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చలు జరిపేందుకు రాయబారి ప్రత్యేక ఆసక్తిని కనబరిచారు.

ప్రైవేట్ స్కూల్ బస్సుడ్రైవర్స్, క్లీనర్స్ నూతన కమిటీ

ప్రజాశక్తి - రేణిగుంట

మండలంలో వరసిద్ధి వినాయక ప్రైవేట్ స్కూలు బస్సు డ్రైవర్లు, క్లీనర్లతో నూతన కమిటీ 13 మందితో ఏర్పాటయ్యింది. అధ్యక్ష కార్యదర్శులుగా మునిచెంగల్‌రాయులు, టి.గోపి, కోశాధికారిగా తౌశిక్‌బాష ఏకగ్రీవమయ్యారు. యూనియన్ జనరల్‌బాడీ సమావేశం రేణిగుంట మంచినీళ్లగుంట వద్ద జరిగింది. సిఐటియు మండల సమన్వయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, కార్యదర్శి ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు 'అపోలో' వైద్యసాయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తిలో జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు వైద్య సాయమందించాలంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అపోలో హాస్పిటల్స్ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన చెన్నైలోని అపోలో మెయిన్ బ్రాంచ్ సిఇఒ నవీన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఫిబ్రవరి 21 నుండి మార్చి 4వరకు ఆలయంలో నిర్వహించే వైద్య శిబిరాలకు అపోలో నుంచి సాయం కావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అపోలో హాస్పిటల్స్ సీఈవో వైద్య సాయం అందించడానికి అంగీకరించారు.

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్

'ప్రజాశక్తి' దినపత్రికలో బుధవారం మంగళపూరి పంచాయతీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కల వల్ల విద్యార్థులకు ప్రమాదం జరుగుతుందనే ఉద్దేశంతో 'పాఠశాల చెంత... పిచ్చి మొక్కల చింత' అని కథనం వెలువడింది. దీంతో స్పందించిన అధికారులు వెంటనే ఆ పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. పాఠశాలలో పిచ్చి మొక్కలు తొలగించటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

బాబు జగజీవన్ రామ్ ప్రాథమిక పాఠశాల నందు ఉచిత ట్యూషన్ సెంటర్‌ను ఎంఈఓ బాలాజీ ప్రారంభించారు. సాయంత్రం 6-8 గంటల వరకు జరిగే ట్యూషన్‌ను వినియోగించుకోవాలని కోరారు. పిల్లలకు చదువుతో పాటు ఆటపాటలు నేర్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మనోహర్, ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, నిర్వాహకులు పి మోహన్ మూర్తి, పి సాయి లక్ష్మి, ఎం నరేంద్ర, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నాగార్జున, యుటిఎఫ్ నాయకులు మధుసూదన్ రెడ్డి, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు

అరుణ్ ఐస్‌క్రీమ్స్ ఫెసిలిటిలో కొత్త ఉత్పత్తి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

అరుణ్ ఐస్ క్రీం ఫెసిలిటీలో కొత్త ఉత్పత్తులను ప్రారంభించినట్లు హాట్సన్ అగ్రో ప్రోడక్ట్ లిమిటెడ్ ఛైర్మన్ పద్మశ్రీ ఆర్. జి. చంద్రమోగన్ తెలిపారు గురువారం విలేకరుల సమావేశం మాట్లాడుతూ హాట్సన్ అగ్రో ప్రోడక్ట్ లిమిటెడ్ యొక్క ఐస్ క్రీమ్స్ బ్రాండ్ అయిన అరుణ్ ఐస్ క్రీమ్స్, గోవిందపూర్ ఫెసిలిటిలో రోజుకు 1.27 లక్షల కిలోల ఐస్ క్రీమ్స్ ఉత్పత్తి చేస్తూ ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. పెరుగుతున్న వినియోగదారుల డిమాండ్‌ను తీర్చడంలో కంపెనీ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు.

పోలీసు సిబ్బందికి డ్రోన్ శిక్షణ

తిరుపతి సిటీ : పోలీసు సిబ్బందికి డ్రోన్ శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించారు. ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ డ్రోన్ కెమెరాతో మరింత సమర్థవంతంగా పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. పనితీరు మెరుగుపరచుకోడానికి సాంకేతిక పరిజ్ఞానం అవసరం అన్నారు. సీఐ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సన్మానం

చిన్నగొట్టిగల్లు: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచి పురస్కారాలు పొందిన అధికారులను గురువారం టిడిపి క్లస్టర్ ఇన్చార్జ్ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. చిన్నగొట్టిగల్లు తహసిల్దార్ జనార్దన్ రాజు, భాకరాపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇమ్రాన్ బాషాల ను శాలువాలు కప్పి, బొకేలు అందజేసి వారి సేవలను కొనియాడారు.

గ్రావెల్ రోడ్లను పరిశీలిస్తున్న వినోద్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి -కోట

కోట మండలంలోని నల్లపరెడ్డి గోపాల్ రెడ్డి వీధిలో రెండు చోట్ల స్థానిక కోట పంచాయితీ నిధుల కింద రెండు లక్షల రూపాయలతో గ్రావెల్ రోడ్లు పనులను చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి జరుగుతున్న ఆయా పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలో మండల గ్రాంట్ లో సిమెంట్ రోడ్లను నిర్మిస్తామన్నారు. కోట సర్పంచ్ ఇండ్ల వెంకటరమణమ్మ, మాజీ ఎంపిటిసీ ఎస్.కే.ఎస్దాని భాష, ఎంపిటీసీ షేక్.షంషుద్దీన్, వార్డు మెంబర్ బాబు,డాక్టర్ నాగభూషణరావు ఉన్నారు.

'ఏకొల్లు' లో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి -దొరవారిసత్రం

మండల పరిధిలోని ఏకొల్లు గ్రామంలో గురువారం పశు వైద్య సిబ్బంది పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పశువులకు, గొర్రెలకు, మేకలకు ఎలాంటి వ్యాధులు సోకకుండా వైద్యం అందించి టీకాలు వేశారు. పశువులకు కావలసిన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ రఫీ, గడ్డం అశోక్, శ్రావణి, ప్రియాంక, వినతి, ఏకొల్లు మాజీ ఎంపీటీసీ ఉదయ్ కుమార్ ఉన్నారు.

ఎస్సీ ఎస్టీ పరిరక్షణ మండలి ప్రెసిడెంట్‌గా నరేంద్ర

ప్రజాశక్తి- యర్రావారిపాలెం

మండలంలోని ఎల్లమంద పంచాయతీ గుట్టకింద మాదిపల్లికి చెందిన జర్రా నరేంద్రను చంద్రగిరి నియోజకవర్గం ఎస్సీ ఎస్టీ పరీక్షణ మండలి ప్రెసిడెంట్గా నియమించినట్లు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ పరిరక్షణ మండల అధ్యక్షులు బుల్లా రాజారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శక్తి వంచన లేకుండా ఎస్సీ ఎస్టీ బలహీన వర్గాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చేటటువంటి పథకాలను అందేలా చూసి వారి అభివద్ధికి తోడ్పడతానని నరేంద్ర తెలిపారు.

రాపిడ్ టాస్క్‌ఫోర్స్ టీం ఆకస్మిక తనిఖీ

కేవీబి పురం : మండలంలోని పెరిందేశం గ్రామంలో గురువారం విలేజ్ హెల్త్ క్లినిక్ లో రోగులకు అందుతున్న వైద్యసేవలను తిరుపతి జిల్లా రాపిడ్ టాస్కోర్స్ టీం ఆకస్మిక తనిఖీ చేపట్టింది. ఈ సందర్భంగా డి పి ఎం ఓ. నాగేంద్ర మాట్లాడుతూ గర్భిణులకు, పిల్లలకు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని తెలిపారు. రాష్ట్ర పథకాలు అమలు పై ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పై అందరికి అవగాహన కల్పించారు.

భూమనను కలిసిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి సిటీ : వైఎస్‌ఆర్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డిని వైసిపి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులుగా నియమితులైన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షులుగా నియమితులైన మల్లం చంద్రమౌళిరెడ్డి, జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు చిన్నియాదవ్‌తో కలిసి పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై భూమన చర్చించారు.

ఫైనాన్స్ ఏజెంట్ల వేధింపులతో...

యువకుడు ఆత్మహత్యాయత్నం!

ప్రజాశక్తి -దొరవారిసత్రం

ఇటీవల ఎన్నో రకాల అనుమతులు లేని ఫైనాన్స్ కంపెనీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రజల ఆర్థిక అవసరాలను దష్టిలో పెట్టుకొని దినం, వారం, మాసం రోజులకు ఓసారి నగదు వసూళ్లు చేస్తున్నారు. ఇచ్చింది కొంతైతే అధిక వడ్డీలతో ఈ కంపెనీలు లాభ పడుతున్నారు. ఇవ్వకపోతే ఆడ,మగ అనుభేదం లేకుండా అనేక రకాలుగా మానసిక వేధింపులకు దిగుతున్నారు. ఇదే క్రమంలో దొరవారిసత్రం మండల పరిధిలోని బూదూరు గ్రామానికి చెందిన గిరిజన కులస్తుడైన చెంబేటి ప్రకాష్ ఏపీ ఏసీ ఫైనాన్షియల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి మానసిక వేధింపులకు గురి చేయడంతో ప్రకాష్ బుధవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబీకులు వైద్యం కొరకు సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో అతనిని మెరుగైన వైద్యం కోసం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు చూస్తుంటే మొదటిగా మైక్రో ఫైనాన్స్ ఏజెంట్లు వారికి కేటాయించిన టార్గెట్లను పూర్తిచేసేందుకు అడుగగానే ఫైనాన్స్ అందిస్తూ ఆపై కొద్ది రోజులకు అనివార్య కారణాల వలన కట్టలేకపోతే వారు అడిగిన సమయం వరకు వేచి చూడకుండా వేధింపులకు దిగడంతో బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ఇలాంటి కంపెనీలపై గతంలో కూడా ప్రభుత్వం గట్టి ఆంక్షలు విధించిన, నేటికీ ఫైనాన్స్ ఏజెంట్ల ఆగడాలు ఆగడం లేదు. ఇలాంటి వాటికి పూర్తిస్థాయిలో విచారించి చర్యలు చేపడుతూ, మైక్రో ఫైనాన్స్ ఏజెంట్ల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని ప్రజానీకం కోరుతున్నారు.

ఎర్రచందనం ముద్దాయిలకు ఐదేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు ముద్దాయిలకు ఆర్ఎస్ఎస్ ఏడిజే కోర్టు ఐదేళ్ల జైలు శిక్షతోపాటుగా ఒక్కొక్కరికి ఆరు లక్షల రూపాయల జరిమానా విధించినట్లు టాస్కోర్స్ హెడ్ సుబ్బరాయుడు తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ 2017 సెప్టెంబర్ మాసంలో శేషాచలం అటవీ పరిధి నాగపట్ల బీటు శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ శ్యామల సెక్షన్ రేంజ్ లో తమిళనాడుకు చెందిన మనీ, దొరస్వామి పట్టు పడ్డారన్నారు. దీనిపై ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహా మూర్తి కేసు పూర్వాపరాలను పరిశీలించి ఒకొక్కరికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారన్నారు. ముద్దాయిలను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

గుర్తు తెలియని మహిళ మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

స్విమ్స్ సర్కిల్ సమీపంలో నెహ్రూ నగర్ బస్టాండ్ వద్ద గుర్తు తెలియని మహిళమృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతురాలిని పరిశీలించారు. మతురాలి వయసు దాదాపు 50 సంవత్సరాలు ఉంటుందని, వివరాలు తెలిసిన వారు ఎవరైనా పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

యువకుడిపై కత్తితో దాడి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ మద్యం మత్తులో కొంతమంది ఓ యువకునిపై కత్తితో దాడి చేసిన ఘటన తిరుచానూరులో చోటుచేసుకుంది. తిరుచానూరు ఇందిరమ్మ ఇళ్లలో నివాసముంటున్న విష్ణుపై కొంతమంది యువకులు పథకం ప్రకారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసుల కథనం మేరకు ... విష్ణు ఇంటి వద్ద నుంచి దిలీప్, భాను, యశ్వంత్, ప్రవీణ్ తో పాటు మరి కొంతమంది యువకులు 'పనుంది రా' అని చెప్పి తీసుకెళ్లారు. పాడిపేట సమీపంలో అందరూ కలిసి ఫుల్లుగా మద్యం సేవించి, కాళ్లు చేతులు కట్టేసి చితక బాదారు. వారి నుంచి తప్పించుకున్న విష్ణు చావు బతుకుల మధ్య ఇంటికి చేరుకున్నాడు. బాధితుడి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. గంజాయి ముఠా ఈ దారుణానికి పాల్పడి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులుకేసు దర్యాప్తు చేస్తున్నారు,

అదుపుతప్పి పోలీసు వాహనం బోల్తా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ రోడ్డుపై వెళుతున్న పోలీసు వాహనానికి ఆవులు అడ్డం రావడంతో అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటనలో సీఐకి, డ్రైవర్ కి గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసు వాహనం విధుల నిమిత్తం తిరుపతికి వస్తున్నారు. నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలోని తిరుపతి రూరల్ ఉప్పరపల్లి సమీపంలో పోలీస్ వాహనానికి ఉన్నట్లుండి రోడ్డుపైకి ఆవులు రావడంతో, వాటిని తప్పించిపోయి, పోలీసు వాహనం పక్కనే ఉన్న పొలంలోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో సీఐ రవి నాయక్‌తో పాటు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

అన్నదమ్ముల వివాదంలో అన్న మృతి

ప్రజాశక్తి - కోట మురుగు నీటి వివాదంతో క్షణికావేశంలో అన్నను తమ్ముడు కర్రతో దాడి చేయడంతో కోటయ్య (46)మతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. కోట మండలంలోని జరుగుమల్లి గ్రామానికి చెందిన కుమారి కోటయ్య, కుమారిమస్తానయ్యలు అన్నదమ్ములు. అయితే మురుగు నీటి వివాదంతో తండ్రి మస్తానయ్య వద్ద ఉన్న కర్ర తీసుకుని క్షణికావేశంలో అన్న కుమారి కోటయ్య తల మీద తమ్ముడు దాడి చేశాడు. గాయపడిన కోటయ్యను కుటుంబీకులు కోట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడంతో అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం న్యూస్

విద్యార్థిని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ఫైల్‌ఫొటో

గూడూరు పట్టణంలోని పంబలేరు వాగులో విద్యార్థిని మృతదేహం లభ్యమైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గూడూరు పోలీసుల కథనం మేరకు...సూళ్లూరుపేట రాఘవయ్యపేటకు చెందిన శ్యాముల్ జయకుమార్, రమాదేవి దంపతుల కుమార్తె లేహనిస్సి ఆదిశంకర కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈనెల 20న కళాశాలకు వచ్చి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు సూళ్లూరుపేటలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 21న మిస్సింగ్ కేసు నమోదయ్యింది. ఇటీవల సమీప బంధువుతో నిశ్చితార్థం జరిగిందని, శుక్రవారం పెళ్లి నిశ్చయమయ్యిందన్నారు. అయితే పంబలేరు వాగులో మృతదేహం లభ్యం కావడంతో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు మృతికి కారణాలను విచారిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్



మండలంలోని గుంటకింద పల్లి ఆంజనేయస్వామి విగ్రహం నుంచి పంగూరుకు పోయే రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదం ఆలస్యంగా వెలుగు చూసింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ నరసింహారావు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల సమయంలో నారాయణపురం పంచాయతీ జింగిలపాలెం దళితవాడలో నివసిస్తున్న గంధం వెంకటేష్(34) జగనన్న కాలనీలో కూలి పని ముగించుకుని తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తున్న సమయంలో అటుగా వెళుతున్న భారీ క్రేన్ అతనిని ఢీకొంది. వాహనం టైర్లు కింద పడడంతో తల భాగం బాగా దెబ్బతిని మృతి చెందాడు. బుధవారం రాత్రి మతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి గురువారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అందజేశామని అన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మతునికి భార్య మనేమ్మ, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. గంధం వెంకటేష్ చిన్న వయసులోనే రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆయన భార్య బిడ్డలు అనాధలుగా మిగిలారని, వారి కుటుంబాన్ని ప్రభుత్వమే అన్ని విధాల ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత

'ఉపాధి' పనుల్లేక కూలీలు 'వలస'

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్

గ్రామాల్లో కూలీలకు రెండు పూటలా పొట్ట నిండుతుందంటే వామపక్షాల ఉద్యమ ఫలితంగా అమలు చేస్తున్న 'ఉపాధి' హామీ పనులేనని చెప్పక తప్పదు. అయితే పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా రోజురోజుకూ 'ఉపాధి' హామీ పథకం నీరుగారిపోతోంది. ఫీల్డ్ అసిస్టెంట్ల కొరతతో పనులు గుర్తించే వారు ఉండటం లేదు. దీంతో పనుల్లేక కూలీలు బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు పోతుండటం గమనార్హం.

ఉపాధి హామీ పనులకు సంబంధించి మండలంలో మొత్తం 44 పంచాయతీలు ఉన్నాయి. ఈ పథకం కింద ప్రస్తుతం 10,310 మంది జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. మండలం మొత్తం మీద 5,196 కుటుంబాలు ఉపాధి హామీ పనిచేస్తున్నారు. 2024 సంవత్సరం ఏప్రిల్ నుంచి 2025 సంవత్సరం జనవరి 30వ తేదీ నాటికి 2,65,426 పని దినాలు కల్పించినట్లు, 440 కుటుంబాల వారు 100 రోజులు పని దినాలు పూర్తి చేసుకున్నారని అధికారులు చెబుతున్నారు. అయితే ఇక్కడి వరకు బాగానే ఉంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ

ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయిలో జరగాలంటే ముఖ్యంగా క్షేత్ర సహాయకులకు ఎంత ప్రాధాన్యత ఉందో అంతే ప్రాధాన్యత ఫీల్డ్ అసిస్టెంట్లుకూ ఉంటుంది. వీరిలో ఏ ఒక్కరు లేకపోయినా ఆ పంచాయతీలో పని అంతంత మాత్రమే ఉంటుంది. క్షేత్ర సహాయకులు ఉపాధి హామీ కూలీలకు వారు చేయాల్సిన పనులు గురించి వివరించి అవగాహన కల్పిస్తారు. క్షేత్ర సహాయకులు చూపించిన పనులను ఫీల్డ్ అసిస్టెంట్లు దగ్గర ఉండి ఉపాధి హామీ కూలీల చేత పనిచేయించి ఏ రోజు ఎంతమంది పనికి వచ్చారు, ఎంత మేరకు పని జరిగిందో సంబంధిత అధికారులకు యాప్ ద్వారా తెలియజేస్తారు. ప్రస్తుతం మండలం మొత్తంలో జీతాలు అందుకునే ఫీల్డ్ అసిస్టెంట్లు ఏడు మంది, మేట్లుగా ఉండి ఉపాధి హామీ పనులు జరిపిస్తున్న వారు 24 మంది ఉన్నారు. మిగతా పంచాయతీలలో ఫీల్డ్ అసిస్టెంట్లు కొరత ఉండటం వలన మండలం మొత్తం మీద సుమారు 1500 మందికి పనులు కల్పించాల్సి ఉండగా ప్రస్తుతం 1006 మందికి పనులు కల్పిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కొరతతో కొన్ని పంచాయితీల్లో గ్రామ ప్రజలు ఉపాధి హామీ పనులు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్లు కొరత లేకుండా చేసి ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పనులు జరిగేలా చూడాలని కూలీలు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత వాస్తవమే : దినేష్, ఎపిఒ

మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఉన్న మాట వాస్తవమే. కొరత ఉన్న పంచాయతీల్లో కొత్తవారిని నియమించాలని పై అధికారులకు నివేదికను పంపాం. త్వరలోనే ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత లేకుండా చూసి, కూలీలకు పనులు కల్పిస్తాం.

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు: సురేంద్ర నాయుడు

తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో అప్పులు పాలు చేసి వెళ్లిపోయారని టిడిపి తిరుపతి పార్లమెంటు డివిజన్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు ధ్వజమెత్తారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమం పేరుతో లక్షల కోట్ల రూపాయలు అప్పులు తీసుకువచ్చి నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్ గా మార్చారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కరాటే చంద్ర, విశ్వనాథం పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు దోషులను అరెస్టు చేయాలి: చిట్టిబాబు

తిరుపతి(మంగళం): చిరు వ్యాపారం చేసుకునే దళితుడైన బోయన బాబుపై హత్యాయత్నం చేయడానికి ప్రయత్నించిన వారిని పోలీసులు అరెస్టు చేయాలని ఎస్సీ ఎస్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు చిట్టిబాబు కోరారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగంకు చెందిన కొనిశెట్టి ప్రవీణ్, కొనిశెట్టి రాము ఇటీవల బోయన బాబును అంత మోందించడానికి ప్రయత్నం చేశారని ఆరోపించారు. దళితులపై దాడి జరిగితే టిడిపికి సంబంధించిన పెద్ద నాయకులు ఇందులో మధ్యవర్తిత్వం చేయాలని పావులు కదపడం విస్మయానికి గురి చేస్తుందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నిందితులను టిడిపి వారి రక్షించాలని చూడడం దేనికి సంకేతం అన్నారు. జిల్లా ఎస్పీ నిష్పక్షపాతంగా హత్యాయత్నం కేసును దర్యాప్తు చేయించి దోషులకు తగిన శిక్ష విధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సుధాకర్, గంగులయ్య, మధు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ పరిశీలన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఏర్పేడు మండలంలోని చింతలపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన తాగునీటి ఆర్వో ప్లాంట్ ను గురువారం శ్రీకాళహస్తి ఆర్ డబ్ల్యూ ఎస్ డీఈఈ శంకర్ రెడ్డి పరిశీలించారు. జెడ్పి నిధులతో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సహకారంతో జడ్పిటిసి తిరుమలయ్య ప్లాంట్ ఏర్పాటులో చొరవ చూపారు. గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉండడంతో ప్రజలు కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. దీంతో గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే సత్వరమే స్పందించి ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి ప్రసన్న, 'ప్రజాశక్తి' డివిజన్ ఇంచార్జి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.





నోటీసులు వెనక్కి తీసుకోవాలంటూ వినతి

ఫారెస్టు నోటీసులు వెనక్కి తీసుకోవాలి

రేంజ్ ఆఫీసు ముందు సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - వెంకటగిరి

హైకోర్టులో కేసు నడుస్తున్న భూములకు సంబంధించి ఫారెస్టువారు ఎలా నోటీసులు ఇస్తారని, ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో ఫారెస్టు రేంజి ఆఫీసు ముందు గురువారం ధర్నా నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లిచెంగయ్య మాట్లాడుతూ పెట్లూరు పంచాయతీ పరిధిలో సీతారాం ఏచూరి నగర్‌లో నివాసాలు ఉంటున్న స్థలానికి సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తోందన్నారు. అయితే ఫారెస్టు అధికారులు అత్యుత్సాహంతో నోటీసులు పంపారన్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న పెద్దోళ్ల జోలికి పోకుండా, పేదలపై జులుం చేయడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. 2011 నుంచి ఈ భూముల్లో పేదలు ఉంటున్నారని, జాయింట్ సర్వేలో సైతం 140 ఎకరాలు రెవెన్యూ భూములు ఉన్నట్లు తేలిందన్నారు. రెవెన్యూ భూముల్లో పేదలు ఉంటే, అటవీ అధికారులు ఎందుకు బెదిరిస్తారని ప్రశ్నించారు. సీతారాం ఏచూరి నగర్‌లో రోడ్లు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చిరంజీవి, నారాయణ, దొరబాబు, పెంచలయ్య, నాగరాజు, ప్రకాష్ ,శివకుమార్, రాజయ్య, దేశమ్మ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారికోర్టు ::తిరుపతి

O.E.P.No. 22/2024
O.S.No. 536/2017

కె.నిర్మల ...వాది / DHr

వర్సెస్

జె.సుజల ...ప్రతివాది/ JDr

ప్రతివాది / JDr కి వేలం నోటీసులు

To
J.Sujala, W/o. R.Bala Krishna, D.No.12-129/A1, Rajeev Gandhi Colony, Thimminaidu palem, Tirupati Urban (m), Tirupati Dist.

పై దావాలో మీ యొక్క హాజరుకు గాను 10.02.2025వ తేదీన పై కోర్టులో వాయిదా వున్నది. ఆ దినం ఉ॥ 10.30 గం॥లకు మీరుగానీ, మీ తరపు వకీలుగానీ పై కోర్టులో హాజరై మీయొక్క ఆక్షేపణలు తెలుపు కోవలసినది. లేనిచో కేసు మీ పరోక్షమున తీర్మానించబడను.

ఇట్లు
RAYAPANENI GAJENDRA, B.Com., B.L.,
P.SUJATHA
DVL DILLIBABU
Advocates, TIRUPATI

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారికోర్టు ::తిరుపతి

I.A.No. 19/2024
O.S.No. 333/2018

ఆర్.మాలతి ...పిటిషనర్

వర్సెస్

యం.చంద్రమౌళిరెడ్డి మరియు కొందరు ...రెస్పాండెంట్స్

5వ రెస్పాండెంట్స్‌కు నోటీసులు

To
N. Nagamani Naidu, C/o. Vaibhav Lodge, Opp to Srinivasam TTD, P..K.Layout, Tirupati

పై దావాలో మీ యొక్క హాజరుకు గాను 25.02.2025వ తేదీన పై కోర్టులో వాయిదా వున్నది. ఆ దినం ఉ॥ 10.30 గం॥లకు మీరుగానీ, మీ తరపు వకీలుగానీ పై కోర్టులో హాజరై మీయొక్క ఆక్షేపణలు తెలుపు కోవలసినది. లేనిచో కేసు మీ పరోక్షమున తీర్మానించబడను.

ఇట్లు
RAYAPANENI GAJENDRA, B.Com., B.L.,
P.SUJATHA
DVL DILLIBABU
Advocates, TIRUPATI

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోగల అవుట్ డోర్ మీడియా ఏజెన్సీలకు డిస్లే డివైసల పత్రికా ప్రకటన

మునిసిపల్ రోడ్లు, ముఖ్యంగా కాలిబాటలు, సెంటర్ డివైడర్లు, ఫ్రీ లెఫ్టులు, బ్లైండ్ కర్వ్‌లపై పెద్దపెద్ద హోర్డింగ్ మరియు కాంటిలీవర్లు ప్రకటనలను అమర్చుటకు అవకాశం కలిపిస్తున్నప్పటికీ ఇటువంటి హెూర్డింగ్‌లు రోడ్డు సెంటర్ డివైడర్ల మీద, రోడ్డును అనుకోని, ప్రభుత్వ భూమి పైన మరియు భవన పైకప్పులపై మరియు ప్రైవేట్ ఆస్తుల ప్రాంగణాల్లో ఏర్పాటు చేయబడ్డాయి. సదరు ప్రకటనలు అమర్చబడి ఉండడం వలన అవి సాధారణ ప్రజల దృష్టిని ఆకర్షించి వాహనాలు మరియు పాదదారుల తీవ్రమైన ప్రమాదాలకు కారణమవ్వటమే కాకుండా ఇనుప హెూర్డింగ్లు టన్నుల బరువును కలిగి వుండడం వలన అవి ఎప్పుడైనా పడిపోవడం ద్వారా ప్రాణాలు మరియు ఆస్తులకు నష్టం కలిగే అవకాశం ఉంది. ఈ కారణాల దృష్ట్యా -

2. APMC చట్టం, 1955 సెక్షన్ 402 (1) (a) & (b) ప్రకారం, కమిషనర్ యొక్క లిఖితపూర్వక అనుమతి లేకుండా
(a) ఏ రహదారిలోనైనా లేదా ఏ ఓపెన్ చానల్ డ్రైన్ లేదా బావిలోనైనా, ఏ స్ట్రీట్ లేదా పబ్లిక్ ప్రదేశంలోనైనా అడ్డంగా లేదా ఆక్రమణ కలిగించే విధంగా ఎలాంటి స్టాల్, కుర్చీ, బాక్స్, నిర్మాణ పదార్థాలు లేదా ఇతర వస్తువులను ఉంచరాదు.
(b) రహదారి ఉపరితలానికి పన్నెండు అడుగుల కంటే తక్కువ ఎత్తులో ఎటువంటి బోర్డు/ కుర్చీ నిర్మాణం రహదారిలోకి ప్రాజెక్షన్ చేయరాదు.

3. సెక్షన్ 402 యొక్క ఉప సెక్షన్ (1) ఉల్లంఘన చేసిన వారిపై జైలు శిక్ష (ఒక నెల వరకు) లేదా రూ.5,000 వరకు జరిమానా లేదా రెండూ విధించబడతాయి. అలాగే సెక్షన్ 397 ప్రకారం ఏ వ్యక్తి కూడా జన సంచారానికి అడ్డంకిగా ఉండేలా ఎటువంటి నిర్మాణం చేపట్టరాదు. APMC చట్టం 1955 సెక్షన్ 397 ఉప-విభాగం 1 ప్రకారం, సెక్షన్ 399లో పొందుపరిచిన అంశాలను తప్పించి, ఏ వ్యక్తి కూడా ఏ ప్రాంగణం ముందు లేదా పక్కాగా ఏ నిర్మాణాన్ని లేదా అమరికను ఏర్పాటు చేయకూడదు లేదా అది రహదారిపైకి ఒంగిపోయేలా, ప్రాజెక్షన్ అయ్యేలా లేదా ఏ విధంగానైనా జనసంచారానికి సురక్షితమైన మరియు సౌకర్యవంతమైన మార్గానికి అడ్డంకిగా మారేలా ఏర్పాటు చేయకూడదు.

4. APMC చట్టం 1955 సెక్షన్ 405 ప్రకారం ఏ గోడ, కంచె, రైలింగ్, స్థంభం, మెట్లు, బూత్ లేదా ఇతర నిర్మాణాలు శాశ్వతం లేదా తాత్కాలిక స్వభావం కలిగివున్నా లేదా ఏ రహదారి పైన, దాని మీద దాని పక్కన లేదా దాని పై ఏర్పాటు చేయబడిన ఏ అమరికనైననూ కమిషనర్ నోటీసు ఇవ్వకుండా తొలగించగలరు.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు W.P. No. 23726 of 2023 కేసులో 13.09.2023 వ తేదీన గుంటూరు నగరపాలక సంస్థ కు ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నది ఏమనగా, "చట్ట అమలును నిరోధించడానికి లేదా చట్టానికి విరుద్ధంగా వ్యవహరించమని సూచించడానికి మాండమస్ రీట్ జారీ చేయబడజాలదు" అని స్పష్టం చేసింది.

5. ఈ సందర్భంలో సామాన్య ప్రజలు గమనించవలసినది ఏమనగా, APMC చట్టం 1955 లోని సెక్షన్ 420 మరియు 421 ప్రకారం ప్రదర్శన పరికరాలు (Display Devices) ఏర్పాటు చేయడానికి నగరపాలక సంస్థ కమిషన్ నుండి అనుమతి అవసరం. దీని కోసం రిజిస్ట్రేషన్ ఫీజు మరియు ప్రదర్శన పరికరాల ఫీజు సెక్షన్ 622 నుండి 625 లో పేర్కొన్న లైసెన్సులు మరియు అనుమతి ప్రక్రియ ప్రకారం వసూలు చేయబడుతుంది.

6. ఈ కార్యాలయ రికార్డుల ప్రకారం వ్యాపార ప్రకటనల కోసం, హెూర్డింగ్లు ఏర్పాటు చేయడానికి కొన్నిరకాల ఏజెన్సీలకు అనుమతులు మంజూరు చేయబడ్డాయి మరియు దీని ప్రతిగా ప్రదర్శన పరికరాల ఫీజు (display device fes) వసూలు చేయబడింది. అయితే ఈ ఫీజులను చెల్లించకుండా ఉండేందుకు కొన్ని ఏజెన్సీలు పలు కారణాలను చూపుతూ గౌరవనీయ హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేసినట్లు గుర్తించబడింది.

7. పై అంశాలను దృష్టిలో ఉంచుకొని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఈ కార్యాలయ రికార్డు ప్రకారం అన్ని ప్రకటన ఏజెన్సీలకు ఎండార్స్మెంట్ లను జారీచేశారు. అవి తమ హెూర్డింగ్ల వివరాలను ధృవీకరించడానికి క్రింద పేర్కొన్న ప్రతులని 7 రోజుల్లోగా తప్పనిసరిగా సమర్పించాలి.

(i) తమచేత ఏర్పాటుచేయబడిన హెూర్డింగ్లు / ఆర్చిన్ / బస్ షెల్టర్స్ / పోల్ కియోస్కులు / ఆర్నమెంటల్ పోల్స్ / లాలీపాప్స్ / ట్రాఫిక్ అంబ్రిల్లాస్ మొదలైన వాటి మొత్తం వివరాల జాబితాను, ప్రతి ప్రకటనకు అనుమతి/రెన్యువెల్ పత్రాలు,
(ii) పెద్ద పరిమాణంలోని హెూర్డింగ్లు, యూనిపోల్, కాంటిలీవర్, గ్యాంట్రీలకు సంబంధించిన నిర్మాణ స్థిరత్వ సర్టిఫికెట్ కాపీలు మరియు,
(iii) ప్రైవేట్ మరియు ప్రభుత్వ భూమి యజమానులు, భవన యజమానులతో చేయబడిన ఒప్పందాల పత్రాలు.

ఈ ఆదేశం ప్రకారం ఈ వివరాలను సమర్పించని యెడల నగరపాలక సంస్థ ప్రదర్శన పరికరాలు (Display Devices) స్థాపనకు ఎలాంటి అనుమతులు ఇవ్వబడలేదని భావించి ప్రస్తుత చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించమైనది. ఇప్పటివరకు కొద్దిమంది ఏజెన్సీలు మాత్రమే ముందుకు వచ్చి ఆ వివరాలను కొంతవరకు సమర్పించాయి.

(i) పెద్ద పరిమాణంలోని హెూర్డింగ్లు, యూనిపోల్స్, కాంటిలీవర్లు, గ్యాంట్రీలకు సంబంధించిన నిర్మాణ స్థిరత్వ సర్టిఫికెట్ కాపీలు మరియు,
(iii) ప్రైవేట్ మరియు ప్రభుత్వ భూమి యజమానులు మరియు భవన యజమానులతో చేసుకున్న ఒప్పంద పత్రాలు.

పై సమాచారాన్ని 7 రోజులలో సమర్పించని యెడల నగరపాలక సంస్థ వారి అనుమతి లేకుండా ప్రదర్శన పరికరాలు (Display Devices) ఏర్పాటు చేయబడినట్లు భావించి ప్రజా మరియు ప్రైవేట్ ప్రాంగణాల్లో లాలీపాప్స్, పోల్-కియోస్క్ హెూర్డింగ్లు, కాంటిలీవర్లు, గ్యాంట్రీలు, బస్ ఎల్టర్స్వంటి అనధికార ప్రకటనలను తొలగించడం జరుగుతుంది. అందుకు నగరపాలక సంస్థ ఎటువంటి బాధ్యత వహించదు. అందకు గాను అగు ఖర్చులను సంబందిత వ్యక్తుల నుండి వసూలు చేయబడుతుంది.

కమీషనరు
తిరుపతి నగరపాలక సంస్థ